క్లుప్తంగా

బాల్య వివాహం అడ్డగింత

వెలిగండ్ల: మండలంలోని మోటుపల్లిలో సోమవారం జరగనున్న బాల్యవివాహాన్ని ఎస్సై పి.మహేష్ కుమార్, ఎంపీడీఓ టి.సుకుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి అడ్డుకున్నారు. మోటుపల్లికి చెందిన 25 ఏళ్ల వ్యక్తికి ఒంగోలుకి చెందిన 13 ఏళ్ల బాలికకు సోమవారం వివాహం చేసేందుకు ఇరు కుటుంబాల పెద్దలు నిర్ణయించారు. విషయం తెలుసుకున్న అధికారులు మోటుపల్లికి వెళ్లి ఇరు కుటుంబాల పెద్దలను, బాలికను, వివాహం చేసుకునే వ్యక్తిని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సెలింగ్ ఇచ్చారు. బాల్య వివాహం చేయడం చట్టరీత్యా నేరమని, చట్టాన్ని అతిక్రమించకూడదని అధికారులు, పోలీసులు హెచ్చరించి పంపించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉలవపాడు: ఉలవపాడులో మంగళవారం ఉదయం 9 గంటలు నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ నరసింహం సోమవారం తెలిపారు. విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో సరఫరా నిలిపివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

నేడు పైరెడ్డిపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం

పొన్నలూరు: మండలంలోని పైరెడ్డిపాలెం సచివాలయం పరిధిలో మంగళవారం ఉదయం 9 గంటలకు వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల నాయకులు తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు పాల్గొనాలని సోమవారం ఓ ప్రకటనలో కోరారు.

28న రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు

సీఎస్‌పురం: మండలంలోని జంగంవారిపల్లిలో ఈ నెల 28న రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పట్టాభి రామచంద్రస్వామి తృతీయ వార్షికోత్సవం సందర్భంగా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో విజేతలకు మొదటి బహుమతి రూ.60 వేలు, రెండో బహుమతి రూ.40 వేలు, మూడో బహుమతి రూ.20 వేలు, నాల్గవ బహుమతి రూ.10 వేలు ఇస్తామన్నారు. అదే విధంగా పోటీల్లో పాల్గొన్న ప్రతి ఎడ్లకు రూ.5 వేలు అందజేస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న ఎడ్ల యజమానులు ఈ నెల 27వ తేదీ లోగా రూ.500 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 6303730448, 9019873815 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పాఠశాలలో వసతుల వివరాలు తెలియజేయండి


మాట్లాడుతున్న ఎంఈఓ శివన్నారాయణ

సింగరాయకొండ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో వసతులపై సమగ్ర వివరాలను యాప్ ద్వారా ప్రభుత్వానికి తెలియజేయాలని ఎంఈఓ బి.శివన్నారాయణ సూచించారు. సోమవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో హెచ్‌ఎంలతో యుడైస్ సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ.. యాప్‌లో ఇచ్చిన వివరాల ప్రకారం పాఠశాలలో వసతులు ఉన్నాయో లేదో నమోదు చేయాలని సూచించారు. రాబోయే ఆర్థిక సంవత్సరానికి అవసరమైన బడ్జెట్‌ను ఈ వివరాల ప్రకారం ప్రభుత్వం అందజేస్తుందని వివరించారు.

25న కొనుగోలు కేంద్రం ప్రారంభం

కందుకూరు అర్బన్: స్థానిక ఏఎంసీ కార్యాలయంలో ఈ నెల 25వ తేదీ బుధవారం ఉదయం 9 గంటలకు మినుములు కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి ప్రారంభిస్తారని బడేవారిపాలెం సొసైటీ సెక్రటరీ తెలిపారు. కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా సత్యసాయి విగ్రహ ప్రతిష్ట

కందుకూరు అర్బన్: స్థానిక సత్యసాయి బాబా మందిరంలో సోమవారం బాబా పాలరాతి విగ్రహాన్ని వేద పండితులు రాఘవశర్మ బృందం శాస్త్రోక్తంగా ప్రతిష్టించారు. రెండు రోజుల నుంచి సత్యసాయి సేవా సమితి కన్వీనర్ నల్లమల్లి శేషు ఆధ్వర్యంలో హోమాలు నిర్వహించారు. అనంతరం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది.

ప్రైవేట్ పాఠశాలలు తనిఖీ

గుడ్లూరు: గుడ్లూరులోని చైతన్య, అభ్యుదయ ప్రైవేట్ పాఠశాలలను కందుకూరు డిప్యూటీ డీఈఓ వెంకటేశ్వర్లు సోమవారం తనిఖీ చేశారు. రెండు పాఠశాలల్లోని రికార్డులు, విద్యార్థుల హాజరు రిజిష్టర్లు, తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్‌లో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు అవసరమైన ప్రభుత్వ ఉన్నత పాఠశాల గదులతో పాటు చైతన్య పాఠశాలలోని గదులను కూడా పరిశీలించామన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్‌యాదవ్


పథకాల లబ్ధి బుక్‌లెట్ అందచేస్తున్న ఎమ్మెల్యే బుర్రా

పీసీపల్లి(కనిగిరి రూరల్): పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. పీసీపల్లి మండలం గుదేవారిపాలెం సచివాలయంలోని రామాపురం, బండ్లపాలెం, గుదేవారిపల్లి గ్రామాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ 99 శాతం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలన సాగుతుందన్నారు. అర్హతే ప్రమాణికంగా కుల, మత, వర్గ, పార్టీలకతీతంగా నవరత్నాల పథకాలను అందచేస్తున్నట్లు చెప్పారు. టీడీపీ హయాంలో కేవలం పచ్చ చొక్కాల వారికే ప్రభుత్వ పథకాలు వచ్చేవని గుర్తు చేశారు. చంద్రబాబు హయాంలో దోచుకోవడం దాచుకోవడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. ఎమ్మెల్యే బుర్రా ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్‌ను అందచేశారు. తొలుత ఎమ్మెల్యే బుర్రాకు వైస్ ఎంపీపీ చెరుకూరి ప్రసన్న, ఎంపీటీసీ సతీష్ చౌదరి, సర్పంచ్ కనపర్తి శ్యాంసన్ గుదే రామారావు, నాగేశ్వరరావులు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ అత్యాల జపన్న, జెడ్పీటీసీ లక్ష్మీకాంతంరెడ్డి, కన్వీనర్ జి.బొర్రారెడ్డి, ఓకేరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సుదర్శన్, ఎంపీటీసీ రమణారెడ్డి, మాజీ ఎంపీపీ బత్తుల అంజయ్య, వీరయ్య, బాలయ్య, రాజారావు, కోటేశ్వరరావు, వై సోమయ్య, ఏనుగంటి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు, ఇతర నేతలు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్‌యాదవ్


రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

పీసీపల్లి(కనిగిరి రూరల్): రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. పీసీపల్లి మండలం గుదేవారిపాలెంలో సోమవారం రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే బుర్రా చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను రైతులకు మరింత చేరువ చేసేందుకే ముఖ్యమంత్రి గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆర్‌బీకే కేంద్రాల్లో వ్యవసాయ అధికారులు రైతులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి తక్షణ సేవలు అందిస్తారన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థల ఏర్పాటుతో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దేశంలో ఆదర్శ ముఖ్యమంత్రిగా నిలిచారని కొనియాడారు. రైతు భరోసా కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అత్యాల జపన్న, వైస్ ఎంపీపీ చెరుకూరి ప్రసన్న, జెడ్పీటీసీ లక్ష్మీకాంతరెడ్డి, ఎంపీటీసీ చెరుకూరి సతీష్ చౌదరి, పార్టీ మండల కన్వీనర్ జి.బొర్రారెడ్డి, ఓకేరెడ్డి, బాలయ్య, గుదే రామారావు, వీరయ్య, నాగేశ్వరరావు, రాజారావు, ఎంపీడీఓ, డీఈ, ఏఈ, వ్యవసాయ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంకమ్మతల్లి బంగారు యంత్రానికి విరాళం


ఎమ్మెల్యే సమక్షంలో విరాళాలు అందజేస్తున్న భక్తులు

కందుకూరు అర్బన్: అంకమ్మతల్లి దేవాలయం పునఃనిర్మాణంలో భాగంగా అమ్మవారి పాదాల చెంత బంగారు యంత్రానికి భక్తులు విరాళాలు అందజేస్తున్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి సమక్షంలో సోమవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మురారి శెట్టి మోహన్, కనిగిరికి చెందిన ఓలేటి మురళీకృష్ణ, పీసీపల్లికి చెందిన కందనూరి శ్రీకాంత్, నెల్లూరుకు చెందిన వెంకటేశ్వర్లులు ఒక్కొక్కరు రూ.5,716 చొప్పున అందజేశారు.

భక్తిశ్రద్ధలతో వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం


చెట్టుమహాలక్ష్మమ్మ ఆలయంలో వాసవి మాతకు బియ్యంతో అభిషేకం చేస్తున్న భక్తులు

పామూరు: వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. వాసవీ మాత ఆలయప్రాంగణంలో ఉదయం గణపతి హోమం నిర్వహించారు. వాసవీమాత మూలవిగ్రహమూర్తికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం సత్యనారాయణస్వామి దేవస్థానం వద్ద నుంచి ఆర్యవైశ్య మహిళలు మేళతాళాల నడుమ జ్యోతులతో ప్రదర్శనగా ఆలయానికి వచ్చారు. అనంతరం దేవస్థానం వద్ద గుండం ఏర్పాటుచేసి గుండం దూకారు. ఆలయంలో కుంకుమార్చన, లలితాసహస్రపారాయణం నిర్వహించారు. దేవస్థాన కమిటీ చైర్మన్ యేల్చూరి బాలకొండలరావు, విశ్వనాథుని మణికంఠ సత్యనారాయణ, దరిశి మస్తాన్‌రావు, శేగు క్రిష్ణయ్య, ఆర్యవైశ్యమహిళలు పాల్గొన్నారు.

కందుకూరు అర్బన్: స్థానిక పామూరు రోడ్డులోని కోదండ రామాలయం వద్ద వాసవీ మాత అమ్మవారికి, కలశానికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేక రథంలో పెద్దబజారులోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం వరకు ఊరేగించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని రథాన్ని లాగారు. ఆలయ ప్రెసిడెంట్ కొత్త వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి నల్లమల్లి వెంకటేశ్వర్లు, చక్కా వెంకట కేశవరావు, ప్రసాదు, ఇడపలపాటి మధు, ఇస్కాల సురేష్, స్వామి పాల్గొన్నారు.


జ్యోతుల ప్రదర్శన నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా వాసవీ మాత ఆత్మార్పణ దినం

సింగరాయకొండ: స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని చెట్టు మహాలక్ష్మమ్మ దేవస్థానంలో సోమవారం వాసవీ మాత ఆత్మార్పణ దినాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత చిన్నారులను వాసవీ మాత ప్రతిరూపంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని అలంకరించి బియ్యంతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక షిరిడీ సాయి మందిరానికి సమీపంలో ఆర్యవైశ్య నాయకుల ఆధ్వర్యంలో వాసవీమాతకు కుంకుమ పూజ, హోమం నిర్వహించారు.

వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు

గుడ్లూరు: స్థానిక మెయిన్ బజారులోని రామమందిరంలో వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆర్యవైశ్యులు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళలు అమ్మవారి విగ్రహాన్ని పట్టు వస్త్రాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు.


అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు


రథం లాగుతున్న మహిళలు

ప్రాణం ఎంతో విలువైంది


మాట్లాడుతున్న మహమ్మద్ రఫీ

కందుకూరు అర్బన్: ప్రాణం ఎంతో విలువైందని, వాహనాలు నడిపే సమయంలో అప్రమత్తంగా ఉండాలని మోటార్ తనిఖీ అధికారి షేక్ మహ్మద్ రఫీ సూచించారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం 34వ జాతీయ రహదారి భద్రత వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ట్రిపుల్ రైడింగ్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రూరల్ ఎస్సై ఎం. శివనాంచారయ్య మాట్లాడుతూ హెల్మెట్, సీట్ బెల్ట్ లేకుండా మితిమీరిన వేగంతో వాహనం నడపరాదన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనం నడపటం ప్రమాదకరమని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కె.మస్తానయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి మేకలు మృతి


మృతి చెందిన మేకలు

గుడ్లూరు: విద్యుత్ తీగలు తగిలి నాలుగు మేకలు మృతి చెందాయి. ఈ మండలంలోని గుండ్లపాలెంలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన చిన కొండయ్య, ప్రసాద్‌లు మేకలను మేపుకోవడానికి పొలాలకు వెళ్లగా..రెండు స్తంభాల మధ్య విద్యుత్ తీగ తెగి కింద పడి ఉంది. అటుగా వెళ్లిన నాలుగు మేకలకు విద్యుత్ తీగ తగలడంతో షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందాయి. మృతి చెందిన నాలుగు మేకల విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

పొగాకు క్యూరింగ్‌లో మెళకువలు పాటించండి

- వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు


దావగూడూరులో పొగాకును పరిశీలిస్తున్న టుబాకో బోర్డు అధికారులు

జరుగుమల్లి(సింగరాయకొండ): పొగాకు క్యూరింగ్, ఉత్పత్తిలో మెళకువలు పాటించి నాణ్యమైన దిగుబడులను సాధించాలని టంగుటూరు వేలం నిర్వహణాధికారి ఎ.శ్రీనివాసరావు రైతులకు సూచించారు. జరుగుమల్లి మండలం దావగూడూరులో సోమవారం పొగాకు బోర్డు ఆధ్వర్యంలో రైతులకు, సిబ్బందికి పొగాకు తయారీలో మెళకువలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వేలం నిర్వహణాధికారి మాట్లాడుతూ.. పక్వానికి వచ్చిన ఆకులనే తుంచి బ్యారన్లలో అమర్చాలని, అన్య పదార్థాలు లేకుండా టార్పాలిన్ పట్టలు వాడాలని సూచించారు. పొగాకు క్యూరింగ్ సమయంలో బ్యారన్ లీకేజీలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. పొగ గొట్టాలపై ఇనుప జాలీ అమర్చాలని, పరిమితికి తగ్గట్లు కర్రలు అమర్చాలని, ఉష్ణోగ్రతను తెలిపే థర్మామీటరును బ్యారన్‌లో తప్పనిసరిగా ఉంచాలన్నారు. అనంతరం పొగ తోటలను, బ్యారన్లను పరిశీలించారు. ఈనెల 31వ తేదీలోగా రూ.10 వేల వడ్డీ లేని రుణానికి రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పొగాకు బోర్డు సీనియర్ గ్రేడింగ్ అధికారి జి.సునీల్ కుమార్, ఐటీసీ ప్రతినిధి జి వెంకట్రావు, జీపీఐ ప్రతినిధి ఆలీ పాల్గొన్నారు.

నారాయణస్వామి ఆలయ ఆదాయం రూ.1.15 లక్షలు


విరాళం అందజేస్తున్న దాతలు

సీఎస్‌పురం: మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ.1,15,349 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి తెలిపారు. స్వామి దర్శనం టికెట్ల అమ్మకం ద్వారా రూ.57,040, స్వామి లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.22,845, స్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకం నిర్వహణకు దాతలు ఇచ్చిన విరాళం రూ.35,464 వచ్చినట్లు చెప్పారు.

విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం


అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎంపీపీ, సర్పంచ్ నాయకులు

పామూరు: విద్యారంగం, మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎంపీపీ గంగసాని లక్ష్మీ, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య అన్నారు. మండలంలోని కంబాలదిన్నెలో రూ.37 లక్షలతో నిర్మించనున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి సోమవారం ఎంపీపీ, జెడ్పీటీసీ, నాయకులు భూమిపూజచేశారు. ప్రభుత్వం నాడు–నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణకు శ్రీకారం చుట్టిందని, అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతిదీవెనతో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భరోసా ఇచ్చిందన్నారు. పామూరు ఒకటో సచివాలయం పరిధిలో రూ.20 లక్షల నిధులతో నూతనంగా నిర్మించనున్న సీసీరోడ్డుకు ఎంపీపీ గంగసాని లక్ష్మీ, సర్పంచ్ రాగమ్మలు భూమిపూజ నిర్వహించారు. పంచాయతీ పరిధిలో మరో రూ.60 లక్షలతో సీసీరోడ్లనిర్మాణం త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి హుసేన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ షేక్.రషీద్, యాదాల వెంకట సాయికిరణ్, కోఆప్షన్ నాయబ్‌రసూల్, ఈఓఆర్డీ బ్రహ్మనందరెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వైష్ణవి, ఎంపీటీసీ, ఇతర నేతలు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా పేదలకు వరం


నగదును అందచేస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: వైఎస్సార్ బీమా పథకం పేదల పాలిట వరమని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 11వ వార్డు కాశిరెడ్డి కాలనీలో చలంచర్ల అల్లురమ్మ(40) మృతి చెందగా, మట్టి ఖర్చుల నిమిత్తం రూ 10 వేల నగదును కుటుంబసభ్యులకు చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ చేతుల మీదుగా అందచేశారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను పార్టీలకతీతంగా అర్హులందరికీ అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ సంక్షేమ కార్యదర్శి వాసు బాబు, గుడ్‌హెల్ప్ ప్రతినిధి రమేష్, వలంటీర్లు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేత


పరీక్షా సామగ్రి అందజేస్తున్న గనుల శాఖ డీడీ పగడాల వెంకటేశ్వరరెడ్డి

వెలిగండ్ల: విద్యాభివృద్ధికి దాతల సహకారం మరువలేనిదని ఎంఈఓ దాసుప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండలంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ చేశారు. గుడిపాటిపల్లికి చెందిన ఏపీ గనులు, భూగర్భ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పగడాల వెంకటేశ్వరరెడ్డి మండలంలోని మొగళ్లూరు, వెలిగండ్ల, ఇమ్మడిచెరువు, పి.నాగులవరం, గుడిపాటిపల్లి , కేజీబీవీ హైస్కూల్స్‌లో 10వ తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు తన సొంతనిధుల నుంచి 380 మంది విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లు, పెన్నులు, జామెంట్రీ బాక్స్‌లు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు అంజనీదేవి, విజయభాస్కర్‌రెడ్డి, గురుప్రసాద్, ప్రభాకర్‌రావు, శ్రీనివాసులురెడ్డి, కొండమ్మ, రామిరెడ్డి, రిటైర్డ్ హెచ్‌ఎం బాలకృష్ణారెడ్డి, పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులను పరిష్కరిస్తాం


అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

కందుకూరు అర్బన్: స్పందన అర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని కమిషనర్ ఎస్ మనోహర్ అన్నారు. మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించారు. స్పందనకు 8 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఒకటో వార్డు జనార్దన కాలనీలో రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు తొలగించాలని, 3వ సచివాలయం పరిధిలో సీసీరోడ్డు, డ్రైనేజీలు, తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేయాలని, 5వ సచివాలయం పరిధిలో ఇంటిపేరు మార్పుచేసి పింఛన్ పునరుద్ధరించాలని అర్జీలు వచ్చాయన్నారు.

నేతాజీ ఆశయాలు అనుసరణీయం


గుడ్లూరులో నేతాజీకి నివాళులర్పిస్తున్న అధికారులు


నేతాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

పామూరు: నేతాజీ ఆశయాలు అనుసరణీయమని ఎంపీపీ గంగసాని లక్ష్మీ, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య అన్నారు. మండలంలోని కంభాలదిన్నె గ్రామానికి చెందిన దాత కొల్లూరి మల్లికార్జుననాయుడు రూ.2.50 లక్షల సొంత నిధులతో మండలంలోని కంబాలదిన్నె, లక్ష్మీనరసాపురం, బొట్లగూడూరు జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాలను ఎంపీపీ, జెడ్పీటీసీలు దాతతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నేతాజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, కోఆప్షన్ నాయబ్‌రసూల్, సింగిల్‌విండో చైర్మన్ పువ్వాడి సుజాత, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, మాజీవైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నేతాజీ జీవితం ఆదర్శం

గుడ్లూరు: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవితం నేటి యువతకు ఆదర్శమని కేంద్ర ప్రభుత్వ క్షేత్ర ప్రచార అధికారి పరవస్తు నాగసాయి సూరి అన్నారు. నేతాజీ జయంతిని పురస్కరించుకొని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శన ఆకట్టుకుంది. పోషణ అభియాన్, స్వచ్ఛ భారత్‌పై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ మాధవి, సర్పంచ్ శంకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.